క్లుప్తంగా

లింగమయ్యస్వామికి చెంచుల పూజలు



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలోని ముదిరెడ్డిబావి ఉద్ద ఉన్న లింగమయ్య, బయన్న స్వాములతో పాటు పెద్దమ్మ దేవి ఆదివాసీ చెంచులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి లింగమయ్య స్వామి ఆలయం వద్ద జాగారం నిర్వహించిన ఆదివాసీ చెంచులు సోమవారం ఉదయం దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాధాల వితరణ అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి నాగయ్య, బాలింగయ్య, బాలేష్, రామచంద్రయ్య, మల్లయ్య, అర్జునయ్య ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



కల్వకుర్తి: నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిసినట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలోని ఇర్విన్‌ను మండల కేంద్రంగా చేయాలని, నియోజకవర్గానికి 6వేల డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, అభివృద్ధికి రూ.వంద కోట్లు ఇవ్వాలని, గిరిజన అభివృద్ధికి రూ.250కోట్లు కేటాయించాలని సీఎంకు విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

చారకొండ: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌కు చారకొండ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ జూపల్లి వెంకటయ్య యాదవ్, జూపల్లి గ్రామానికి చెందిన నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్, లింగం, వెంకట్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు స్థలానికి అనుమతి ఇవ్వాలని సోమవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. అనువైన స్థలాలు లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు విషయాన్ని సర్పంచ్ గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో నాయకులు పరుశరాములు, శరబంద, రాజు, కృష్ణయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలి

అచ్చంపేట రూరల్: విద్యార్థులకు సులభమైన రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈఓ రామారావు కోరారు. ఈనెల 4న అచ్చంపేటలో నిర్వహించే మండల స్థాయి టీఎల్‌ఎం మేళాపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కమిటీలు ఏర్పాటు చేశారు. టీఎల్‌ఎం మేళాలో సృజనాత్మకంగా తయారు చేసిన బోధన అభ్యసన సామాగ్రిని ప్రదర్శించాలని సూచించారు. ప్రతి పాఠశాల నుండి ప్రతి విద్యార్థి పాల్గొనే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం అరుణ, శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభరాణి హాజరయ్యారు. దీంతో అధికారుల తీరుపై ఫిర్యాదుదారులు మండిపడ్డారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో సోమవారం హైమాస్ట్ లైట్లను సర్పంచ్ కాలె లక్ష్మమ్మ ప్రారంభించారు. ఎంపీ నిధుల నుంచి రూ.3లక్షలు మంజూరు కావడంతో రెండు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జంగయ్య, సర్దార్, బీరప్ప, నిరంజన్, జంగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుడి మృతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు బాలస్వామి(44) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలస్వామి సోమవారం ఉదయం చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.



పెంట్లవెల్లిలో పూజలు చేస్తున్న జూపల్లి కృష్ణారావు



లింగాలలోని రామాలయంలో..



అచ్చంపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కల్వకుర్తిలో..

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కొల్లాపూర్: ముక్కోటి ఏకాదశిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. పట్టణంలోని రామమందిరం, మాదవస్వామి దేవాలయం, బండాయిగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పూజలకు హాజరయ్యారు. రామమందిరంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బిచ్చమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని దేవల్‌తిరుమలాపూర్ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో సుదర్శన యాగాన్ని 108 గంటలతో నిర్వహించారు.

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధాన అర్చకుడు రామాచారీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మా స్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకదశిని పురష్కరించుకొని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్రాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. అమ్రాబాద్ శ్రీ కోదండ రామాలయంలో భక్తులు ఉత్తర ద్వారంగుండా ప్రవేశించి పూజలు చేశారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాల రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం నుండే భక్తులు ఉత్తర ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా వెంకటేశ్వర స్వామి దర్శనాన్ని కల్పించారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలకపల్లి: స్థానిక భ్రమరాంభికా దేవి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.



కొల్లాపూర్‌లోని బండాయిగుట్ట వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు



పెద్దకొత్తపల్లి మండలం దేవల్ తిరుమలాపూర్‌లో యాగం నిర్వహిస్తున్న భక్తులు



తెలకపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కల్వకుర్తి వెంకటేశ్వర ఆలయంలో దాండియా ఆడుతున్న మహిళలు



అమ్రాబాద్ కోదండరామాలయంలో ఉత్తర ద్వారం గుండా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తండాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీపీ విజయ

వెల్దండ: నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక దృష్టి పెట్టారని ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి పేర్కొన్నారు. సోమవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే మారుమూల గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారన్నారు. దీంతో అన్ని గిరిజన తండాల్లో గిరిజన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో గిరిజన తండాలకు బీటీరోడ్లు, ప్రత్యేక గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శిఖం హద్దులపై మత్స్యకారుల దీక్ష



బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆయా కుంటలు, చెరువుల శిఖంలు, ఎఫ్‌టీఎల్ పరిధిని, హద్దులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామానికి చెందిన మత్స్యకారులు సోమవారం మండల కార్యాలయాల ఏదుట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ మండల కేంద్రంలోని చెరువులు, కుంటలను సర్వే చేసి ఎఫ్‌టీఎల్ పరిధులను, బఫర్ జోన్లు ఫిక్స్ చేయాలని అధికారులను విన్నవించుకున్నా ఫలితం లేదని, దీంతో శాంతియుత దీక్ష చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికైనా సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సర్పంచ్ బాలీశ్వర్, ఉప సర్పంచ్ రాములు మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలని నిరసన



తాడూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, బీఎస్పీ నాయకులు



కల్వకుర్తిలో వినతిపత్రం అందజేస్తున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు

తాడూరు: రైతులు అతివృష్టి, అనావృష్టితో పాటు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి పండించిన పత్తికి మద్దతు ధర కల్పించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కు బీఎస్పీ నాయకులు వినతిపత్రం అందించారు. నిరంతరం కష్టపడి పండించిన రైతుల శ్రమ దోపిడి కాకుండా ప్రభుత్వమే గిట్టుబాటు ధర రూ.15వేలు క్వింటాల్‌కు కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు లక్ష్మణ్, బాలు, వెంకటయ్య, మహేశ్, రాంచంద్రయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగాల: పత్తి పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మునిరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు మన్నెం రాము, ఉపాధ్యక్షుడు లింగస్వామి, నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

తెలకపల్లి: పత్తికి మద్దతు ధర కల్పించాలని బీఎస్పీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు శివశంకర్, నాయకులు సుల్తాన్, బాలనాగయ్య, రాజేశ్, సందీప్, మహేశ్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పత్తి రైతులకు బహుజన సమాజ్ పార్టీ అండగా నిలుస్తుందని అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఆంజనేయులు అన్నారు. సోమవారం పత్తికి కనీస మద్దతు ధర చెల్లించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, బాబు, నాగరాజు, లోకేశ్ పాల్గొన్నారు.

అమ్రాబాద్: పత్తికి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో అమ్రాబాద్, పదర తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అధిక వర్షాలతో వానాకాలం పత్తి పంట పూర్తిగా నష్ట పోయిందని, ఉన్న పత్తికి కూడా సరైన ధర లేక రైతులు మరింత నష్ట పోతున్నారని బీఎస్పీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఏకలవ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



జిల్లా కేంద్రంలో తపస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ గోవిందరాజులు

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నూతన క్యాలండర్‌ను డీఈఓ గోవిందరాజులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంజి రాజారెడ్డి, కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా సంఘ బాధ్యులు ప్రవీణ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

ఉప్పునుంతల: నూతన పీఆర్సీ కోసం ప్రభుత్వం వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎస్టీయూ టీఎస్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హన్మంత్‌రెడ్డి, రవిశేఖర్, నోడల్ అధికారి రమేష్, ఎస్టీయూ నాయకులు సతీష్, సింగోటం, లక్ష్మారావు, సత్యనారాయణ, వెంకట్రావు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



తాడూరులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చారకొండ: రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలను వెంటనే పూర్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మహిపాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో సోమవారం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ నాయక్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

తాడూరు: పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సురేందర్‌రెడ్డి, రామచందర్‌రావు పాల్గొన్నారు.

మతమార్పిడిలపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తిరూరల్: పట్టణంలో జరుగుతున్న మత మార్పిడిలపై సమగ్ర విచారణ చేసి కారణమవుతున్న వారిని చట్ట ప్రకారం శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పలు ముస్లిం, మైనార్టీల షాపుల్లో పని చేసే హిందూ యువకులను మత మార్పిడి చేసి ఉగ్రవాదులుగా మార్చే కుట్రకు తెరతీస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తెలకపల్లి: మండలంలోని గోలగుండానికి చెందిన కడెం చిన్నయ్య ఆదివారం పాముకాటుకు గురై మృతిచెందాడు. సోమవారం చిన్నయ్య అంత్యక్రియలు జరిగాయి. బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్‌కు చెందిన అర్జునయ్య మృతిచెందడంతో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ మోపతయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, కాశీం, శ్రీనివాస్, ఫయాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో సోమవారం తెల్లవారుజామున బరుపటి బాలయ్య(48) అనారోగ్యంతో మృతిచెందాడు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మోపతయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుని కుమారుడు హరీష్‌కు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడొద్దు

కందనూలు: కోట్లాది మంది ఆరాధ్యదైవం అయ్యప్ప స్వామిపై బైరి నరేష్ చేసిన వాఖ్యలను ఖండిస్తున్నట్లు పీసీసీ వైస్ ప్రసిడెంట్ మల్లురవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఏ మతాన్ని, దేవుడిని విమర్శించడాన్ని తాము వ్యతిరేకిస్తామని అన్నారు. స్వార్థం కోసం ఇలాంటి వాఖ్యలు చేస్తున్నారని, అట్టివారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెంచులకు డ్రమ్స్ పంపిణీ



అమ్రాబాద్: ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన చెంచు యువకులకు సేర్‌బాజా (డ్రమ్స్) ఉచితంగా అందజేశారు. మొత్తం రూ.25వేల విలువగల ఈ డ్రమ్స్‌తో చెంచు యువకులు ఉపాధి పొందుతారనే ఉద్దేశంతోనే అందజేసినట్లు కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాల్‌రాంనాయక్ తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, శివ, బాలేష్ ఉన్నారు.

నిధులు దారి మళ్లించడం సరికాదు



అచ్చంపేటలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం అచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్పంచ్‌లకు బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కేంద్రం నుంచి మంజూరైన నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలోకి మార్చుకోవడం సరికాదన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సోమవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. చింతలపల్లి జగదీశ్వర్ రావు, అభిలాష్‌రావు వర్గాలకు చెందిన నాయకులు వేర్వేరుగా సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఉప్పునుంతల: గ్రామ పంచాయతీల నిధులను దారి మళ్లించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మన్ననూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెంకటరమణ విమర్శించారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం సరికాదని అన్నారు.

తెలకపల్లి: కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు.

బల్మూర్: గ్రామ పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పిలుపు మేరకు సోమవారం బల్మూర్‌లో నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్ దహనం చేశారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు నాయకులు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు.

దళితబంధు పేరుతో మభ్యపెడుతున్న ప్రభుత్వం

అచ్చంపేట రూరల్: దళితబంధు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు మోతుకూరి నాగార్జున్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు పథకాన్ని అమలు చేశారని, అక్కడ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నియోజకవర్గానికి రూ.200కోట్ల నిధులు తీసుకొస్తానని చెబుతున్నారని, ప్రజలు కట్టిన పన్ను ఆధారంగా నియోజకవర్గాలకు నిధులు కేటాయిస్తారన్నారు. విద్యుత్, ఆర్టీసీ బస్సు ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలను పెంచారన్నారు.

డ్రమ్‌సీడర్ విధానంతో అధిక దిగుబడులు

తెలకపల్లి: వరి పంట సాగు విధానంలో డ్రమ్ సీడర్ ఉపయోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ మండల అధికారి సందీప్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జమిస్తాపూర్‌లో శ్యాంసుందర్ రావు అనే రైతు పొలంలో డ్రమ్‌సీడర్ ద్వారా వరి పంట విత్తుకునే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. మూమూలు పద్ధతి కంటే ఎకరానికి రూ.8వేల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ్ సాగర్ పాల్గొన్నారు.



కస్తూర్బాలో గుడ్డు బంద్



బల్మూర్: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పది రోజులుగా విద్యార్థినులకు భోజనంలో గుడ్లు ఇవ్వకపోవడంపై సర్పంచ్ శివశంకర్ డీఈఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం కస్తూర్బాగాంధీ విద్యాలయన్ని సర్పంచ్‌తో పాటు గ్రామ రైతు సమితి అధ్యక్షుడు నాగయ్యలు సందర్శించారు. ఎస్ఓ లేకపోవడంతో విద్యార్థుల కోసం వండిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థినులకు పది రోజులుగా గుడ్లు ఇవ్వడం లేదని, నీళ్ల చారు వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. డీఈఓ గోవిందరాజులుకు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేశారు. సమస్యలను ప్రభుత్వ విప్ గువ్వల బలరాజు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయమై ఎస్ఓ లలితను వివరణ కోరగా, గుడ్లు బాగాలేకపోవడంతో వాపస్ పంపించినట్లు తెలిపారు. నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

బిజినేపల్లి: అప్పుల ఊబిలో కూరుకుపోయి సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుందని, న్యాయపరంగా పోరాటం చేస్తుంటే అరెస్టులు చేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారి పర్వతాలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.